క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో రాష్ట్ర మార్కెటింగ్ కమిటీ చైర్మన్



బంగార్రాజుకు అప్పన్న జ్ఞాపికను అందిస్తున్న సూపరింటెండెంట్ త్రిమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం రాష్ట్ర మార్కెటింగ్ కమిటీ చైర్మన్ కె.బంగార్రాజు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, జ్ఞాపికలను సూపరింటెండెంట్ త్రిమూర్తులు అందజేశారు.

అప్పన్న అన్నప్రసాదానికి విరాళం



దాత చంద్రశేఖర్‌కు బాండ్ అందిస్తున్న దేవస్థానం ఉద్యోగి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన పసుపులేటి చంద్రశేఖర్ రూ.లక్ష 1,116ల విరాళాన్ని నగదు రూపంలో బుధవారం ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ బాండ్‌ని అందించారు. స్వామివారి దర్శనం కల్పించి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని ఆలయ అధికారులు అందజేశారు.

చందనం సమర్పణకు రూ.లక్ష విరాళం



చెక్కును అందిస్తున్న దాతలు ప్రకాశరావు, లలిత దంపతులు

సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామికి చందనం సమర్పణ నిమిత్తం నగరంలోని విశాలాక్షినగర్‌కి చెందిన ఏఎస్ ప్రకాశరావు, లలిత దంపతులు బుధవారం రూ.లక్ష విరాళాన్ని అందించారు. సంబంధిత చెక్కుని ఆలయంలో సూపరింటెండెంట్ త్రిమూర్తులకు ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

నేస్తాలమ్మ పండగ నేడు



పరవాడ: వాడచీపురుపల్లి, నాయుడుపాలెం గ్రామాల ఆరాధ్య దైవం నేస్తాలమ్మ అమ్మవారి పండగను గురువారం వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఉదయం నుంచి అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేస్తారు. భక్తుల కోసం ఆలయం వద్ద బారికేడ్లు, షామియానాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఉచిత ప్రసాదం, మంచినీరు, మజ్జిగ అందించేందుకు సన్నాహాలు చేశారు. సాయంత్రం డప్పు వాయిద్యాలు, కోయడ్యాన్సులు, చిడతలు, తప్పెటగుళ్ల వంటి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవారి అనుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. పండగ సందర్భంగా దాతల సహకారంతో గురువారం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన చేయనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

రేషన్ కార్డుల కోసం వినతి

అగనంపూడి : విశాఖ ఉక్కు విశ్రాంత ఉద్యోగులకు తెల్ల రేషన్ కార్డులివ్వాలని అగనంపూడికి చెందిన కార్మిక సంఘాల నాయకులు కోరారు. విశాఖ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వి.భాస్కరరావును వీరంతా బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. నాలుగు దశాబ్దాలు సర్వీస్ చేసిన ఉక్కు ఉద్యోగులకు కేవలం ఈపీఎస్ పెన్షన్ నాలుగు వేలు మాత్రమే వస్తుందని, కుటుంబ పోషణ కష్టంగా ఉందని, తెల్ల రేషన్ కార్డు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని కోరారు. వేలాది మంది విశ్రాంత ఉద్యోగులకు న్యాయం చేయాలని నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, మరిశా రామచంద్రరావు, బలిరెడ్డి శ్రీను, బండారు చందు, పలకా అచ్చుత్ పాల్గొన్నారు.

చెరువును చెరబట్టి.. పాకలేసి విక్రయించి

కాసుల కక్కుర్తికి.. అధికారం అండదండలు తోడవడంతో 'పచ్చ'మూకలు భూ కబ్జాలకు తెగబడుతున్నాయి. అధికార టీడీపీ నాయకులు ప్రభుత్వ పోరంబోకు, గెడ్డ స్థలాలతోపాటు చెరువుల్నీ ఆక్రమిస్తున్నారు. చిన్నచిన్న పాకలు వేసి, జీవీఎంసీ, విద్యుత్ శాఖ సిబ్బంది సహకారంతో ఇంటిపన్ను, విద్యుత్ మీటర్లు ఏర్పాటుచేయించి, అందినకాడికి అమ్ముకుంటున్నారు. వీరి ప్రలోభాలకు చిక్కి పేద, దిగువ మధ్య తరగతి ప్రజలు నష్టపోతున్నారు. రెవెన్యూ యంత్రాంగం నిర్లిప్తతపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- 'పచ్చ'మూక కబ్జాలో కార్మికనగర్ చెరువు
- అర్ధరాత్రి డెబ్రిస్‌తో పూడ్చేస్తున్నారు
- పేదలే లక్ష్యంగా రూ.లక్షల్లో దోపిడీ
- కన్నెత్తి చూడని రెవెన్యూ అధికారులు



టీడీపీ నాయకుడు వేసిన అనధికారిక పాకలు



కార్మికనగర్‌లో రాత్రి సమయంలో చెరువును మట్టితో పూడ్చుతున్న దృశ్యాలు

పెందుర్తి: నియోజకవర్గ పరిధిలో స్థలాల కబ్జాలో 'పచ్చ'మూకలు రెచ్చిపోతున్నాయి. ప్రభుత్వ స్థలాలు, గెడ్డలతో పాటు ఏకంగా చెరువులనే మింగేస్తున్నాయి. ముఖ్యంగా జీవీఎంసీ 97వ వార్డు పరిధిలోని సుజాతనగర్‌కు సమీపంలో ఉన్న కార్మికనగర్ చెరువును అధికార కూటమి పెద్దన్న టీడీపీకి చెందిన నాయకులు చెరబట్టారు. స్థానిక, జిల్లా స్థాయి రెవెన్యూ అధికారుల కళ్లుగప్పి చెరువును యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. రాత్రికి రాత్రే చెరువు గర్భాన్ని పూడ్చేసి కబ్జాకాండను కొనసాగిస్తున్నారు. కిందిస్థాయి యంత్రాంగాన్ని మచ్చిక చేసుకుని ఈ పచ్చ భూ బ్రోకర్లు సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా.. రెవెన్యూ యంత్రాంగం మిన్నకుండిపోవడంపై పెద్ద ఎత్తున విమర్శలు చెలరేగుతున్నాయి.

తొలుత చదును చేసి.. ఆపై పాకలు వేసి

సుజాతనగర్ సమీపంలోని కార్మికనగర్‌లోని చెరువును టీడీపీ నాయకులు తమ కబంద హస్తాలతో బంధించారు. నలుగురు టీడీపీ నాయకులు ఏకమై ముఠాగా ఏర్పడి రాత్రికి రాత్రే చెరువును మట్టితో పూడ్చేస్తున్నారు. ఆ స్థలాన్ని తమ స్వాధీనంలోకి తెచ్చుకుని ముందుగా పాకలు వేస్తున్నారు. స్థానిక విద్యుత్ శాఖ, జీవీఎంసీ ఇంటి పన్ను(రెవెన్యూ శాఖ) అధికారులను 'మచ్చిక'చేసుకుని విద్యుత్ మీటర్‌తో పాటు ఇంటి పన్ను కూడా వేయిస్తున్నారు. తరువాత ఆ స్థలాలను రూ.లక్షల్లో విక్రయిస్తున్నారు. ఒకవేళ కబ్జాకాండను ఎవరైనా రెవెన్యూ సిబ్బంది ప్రశ్నిస్తే 'మా ఇంట్లో పనివాడికి.. ఉండేందుకు ఇల్లు కూడా లేదు. తల దాచుకోవడానికి చిన్న పాక వేశాం' అని నమ్మబలుకుతున్నారు. దాంతోపాటు ఎవరో ఒక టీడీపీ ప్రజాప్రతినిధి, నాయకుడితో మాట్లాడించడంతో సదరు అధికారులు మిన్నకుండిపోతున్నారు.

పేద, దిగువ మధ్యతరగతి వారే లక్ష్యంగా..

పెందుర్తి ప్రాంతంలో ప్రభుత్వ భూములకు కొదవ లేదు. ఈ భూముల్లో కిందిస్థాయి అధికారుల అండతో కొందరు అధికార 'పచ్చ'పార్టీ నాయకులు పాగా వేశారు. పెందుర్తి, చినముషిడివాడ, సుజాతనగర్ ప్రాంతాల్లో చోటామోటా టీడీపీ నాయకులే బ్రోకర్ల అవతారం ఎత్తుతున్నారు. ఖాళీ స్థలాలతో పాటు చెరువులు, కొండలు, ఇతర ప్రభుత్వ స్థలాలను చదును చేస్తున్నారు. ముఖ్యంగా కార్మికనగర్ కేంద్రంగా అక్కడ చెరువులో టీడీపీ ముఠా గజాల చొప్పున ప్లాట్లు వేసి పేద, దిగువ మధ్యతరగతి వారిని ముగ్గులోకి దింపుతున్నారు. కూలీ పనులు, చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకుంటూ కడుపు కట్టుకుని వీరు దాచుకున్న సొమ్మును దోచుకోవడమే లక్ష్యంగా 'పచ్చ'నేతలు ప్రలోభాల ఎర వేస్తున్నారు. తక్కువ ధరకే ఇంటి స్థలం వస్తుందన్న భ్రమలో పేదలు బలవుతున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.లక్షల్లో దోచుకుంటున్నారు. ఇందులో క్షేత్ర స్థాయి అధికారులకూ వాటా ఉందన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి కార్మికనగర్‌తో పాటు పెందుర్తి ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలను కాపాడాలని, మరెవరూ వీరి మోసాలకు చిక్కకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలాలు కొనుగోలు చేయొద్దు



ప్రభుత్వ స్థలాల సంరక్షణే మా బాధ్యత. ప్రభుత్వ స్థలంలో ఎవరు నిర్మాణం చేపట్టినా కూల్చేస్తాం. ఇక అమ్మకాల సంగతి మా దృష్టికి రాలేదు. ఎవరైనా బాధితులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే దానిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ స్థలాలు కొనుగోలు చేస్తే నష్టపోవడం తప్ప మరే ప్రయోజనం ఉండదు. కార్మికనగర్‌లో అక్రమాలకు అడ్డుకట్ట వేస్తాం.

– ఎం.ఆనంద్‌కుమార్, తహసీల్దారు, పెందుర్తి

పారదర్శకంగా మద్యం షాపుల లాటరీ

- సబ్బవరం ఎక్సైజ్ సీఐ అనిల్‌కుమార్



సబ్బవరం: ప్రతి మద్యం దుకాణానికి అనకాపల్లి జిల్లా కలెక్టర్ సమక్షంలో మాన్యువల్ విధానంలో పారదర్శకంగా లాటరీ నిర్వహించనున్నట్లు సబ్బవరం ఎక్సైజ్ సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో మీడియాతో బుధవారం ఆయన మాట్లాడారు. గెజిట్ నోటిఫికేషన్‌లో నెంబర్లవారీగా చూపిన ప్రతి మద్యం దుకాణానికి దరఖాస్తుదారుల సమక్షంలో లాటరీ తీస్తామన్నారు. సబ్బవరం సర్కిల్ పరిధిలో సబ్బవరం మండలంలో 8, పరవాడలో 11 దుకాణాలు గెజిట్‌లో నోటిఫై అయ్యాయన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి, అనకాపల్లి పేరిట రూ.2 లక్షల డీడీని తీసి, ఆన్‌లైన్/అఫ్‌లైన్ విధానంలో దరఖాస్తులను సమర్పించవచ్చన్నారు. లాటరీని అనకాపల్లిలోని ఉప్పాల చంద్రశేఖరరావు కల్యాణమండపంలో నిర్వహిస్తామన్నారు. .

సెయిల్‌లో విలీనం చేయాలి

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని నిరసిస్తూ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో 1336వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించి సొంత గనులు కేటాయించాలని కోరారు. సుమారు మూడున్నర సంవత్సరాల నుంచి ఉక్కు పరిరక్షణ కోసం వివిధ రకాల పోరాటాలు చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం ఆలోచించకుండా ముందుకెళ్తుండడం ఆంధ్రులను రెచ్చగొట్టడమే అవుతుందన్నారు. పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎస్.రామారావు విళ్లా రామ్మోహన్‌కుమార్, వరసాల శ్రీనివాసరావు, సుబ్బయ్య పాల్గొన్నారు.



కొద్ది రోజుల క్రితం దాదాపుగా ఎండిపోయిన మేహాద్రిగెడ్డ



ప్రస్తుతం నీటితో కళకళలాడుతున్న జలాశయం

నాడు వెలవెల.. నేడు జలకళ

నగర ప్రజల దాహార్తిని తీర్చే మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ రెండు నెలల క్రితం బీడువారింది. ప్రకృతి సహకరించకపోడంతో పూర్తిగా ఎండిపోయి కళావిహీనంగా కనిపించేది. రిజర్వాయర్ ఎగువ ప్రాంతంలో కొన్ని చోట్ల ఆరుతడి పంటలు వేసేందుకు స్థానికులు సిద్ధమయ్యారు. ఇటీవల కాలంలో కురిసిన వర్షాలతో పరిస్థితి మారింది. మేహాద్రిలో జలకళ నెలకొంది. ప్రధానంగా గత నెల్లో కురిసిన భారీ వర్షాలకు అధికంగా వరదనీరు చేరడంతో జలాశయం నిండుకుండను తలపిస్తోంది. వరద ఉధృతి పెరగడంతో ఒకటి రెండు గేట్ల ద్వారా నీటిని దిగువకు విడిచిపెట్టినా.. ప్రస్తుతం జలాశయం కళకళలాడుతోంది.

- పెందుర్తి

సబ్సిడీపై ఉల్లి, టమాటా, నూనెలు

- ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటుకు చర్యలు
- నిత్యావసరాల ధరల నియంత్రణకు తనిఖీలు
- అధికారులు, వ్యాపారులతో జేసీ జాహ్నవి

తుమ్మపాల: నిత్యవసరాల ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్టు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అన్నారు. కలెక్టరేట్‌లో ధరల నియంత్రణపై పౌర సరఫరాలు, మార్కెటింగ్, తూనికలు కొలతల శాఖల అధికారులు, హోల్‌సేల్ వ్యాపారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉల్లిపాయలు, టమాటా, వంటనూనెలను ప్రత్యేక కౌంటర్ల ద్వారా అమ్మకాలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సరకుల కృత్రిమ కొరత సృష్టించకుండా తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సరుకుల స్టాకు, అమ్మకాలపై రోజువారీ నివేదిక అందించాలని తూనికలు కొలతల శాఖ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక కౌంటర్లలో సరకుల విక్రయాలకు హోల్‌సేల్ మార్కెట్లో సమాచారం సేకరించి ధరలు నిర్ణయించాలని సూచించారు. అనకాపల్లి, నర్సీపట్నం, యలమంచిలి హోల్‌సేల్ మార్కెట్‌లు, అనకాపల్లి బెల్లం మార్కెట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌ల ద్వారా ఉల్లిపాయలు కేజీ రూ.60, టమాటా రూ.52, పామోలిన్ నూనె లీటరు రూ.117, ఫ్రీడం సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటరు రూ.126, వేరుశనగనూనె రూ.155 చొప్పున అమ్మకాలు జరుగుతాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గల మోర్, రిలయన్స్, డీమార్ట్, విశాల్ అవుట్‌లెట్‌లలో కూడా ఇవే ధరలకు సరకులు లభిస్తాయన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి టి.వి.ఎల్.ఎన్.మూర్తి, సివిల్ సప్లయి జిల్లా మేనేజర్ పి.జయంతి, మార్కెటింగ్, తూనికలు కొలతల శాఖల అధికారులు, హోల్‌సేల్ వ్యాపారులు, షాపింగ్ మాల్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సరస్వతీ నమస్తుభ్యం వరదే అక్షర రూపిణి

శరన్నవరాత్రుల్లో భాగంగా బుధవారం అమ్మవారు వాగ్దేవతామూర్తి సరస్వతీదేవిగా శ్వేత వస్త్ర ధారిణియై భక్తులకు దర్శనమిచ్చారు. ఆశ్వీయుజ శుద్ధ సప్తమి మూలా నక్షత్రం జగన్మాత జన్మనక్షత్రం. దీంతో ఊరూవాడా అమ్మవారి ఆలయాలు, విగ్రహాలను కొలువుదీర్చిన మండపాలు భక్తులతో కిక్కిరిశాయి. విద్యార్థులు సరస్వతీదేవి రూపంలోని అమ్మవారిని దర్శించుకుని, విద్యాబుద్ధులకై ప్రత్యేక పూజలు జరిపారు. పలు చోట్ల అమ్మవారి ఆలయాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు, అన్నసమారాధనలు జరిగాయి.

- అక్షరాభ్యాసాలతో ఆలయాలు కిటకిట
- సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు
- ఏడో రోజు ఊరూవాడా వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



అడవివరంలో సరస్వతీదేవి అలంకరణలో దుర్గమ్మ



సుజాతనగర్లో సరస్వతిగా కనకదుర్గమ్మ



శ్రమశక్తినగర్‌లో సరస్వతిగా పంచముఖ గాయత్రీదేవి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



బాలాత్రిపుర సుందరిగా పూజలు అందుకుంటున్న బాలికలు



ముగ్గుల పోటీలను సందర్శిస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు



పరవాడ సంతబయలు వద్ద అన్నసమారాధనలో కమిటీ సభ్యులు, భక్తులు

పెందుర్తి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెందుర్తిలోని పలు అమ్మవార్ల దేవాలయాల్లో ఏడవ రోజు బుధవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. సరస్వతీదేవి/విద్యాలక్ష్మి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు.

- చినముషిడివాడ పంచముఖ గాయత్రీమాత ఆలయంలో భారీఎత్తున కుంకుమార్చన నిర్వహించారు. ముందుగా అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. సరస్వతీదేవిగా అమ్మవారు పూజలందుకున్నారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. ప్రసాద వితరణ చేపట్టారు.
- సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధిలో సామూహిక కుంకుమ పూజలు చేశారు. అమ్మవారికి విశేష అభిషేకాలు జరిపారు. విద్యాలక్ష్మిగా భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.
- పెందుర్తి మహాకామేశ్వరి ఆలయంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి, సామూహిక అక్షరాభ్యాసాలు, కుంకుమ పూజలు జరిపారు. ముందుగా విశేష అర్చనలు నిర్వహించారు.
- ఎస్ఆర్ పురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరణ చేశారు. సామూహిక కుంకుమ పూజలు జరిపారు. అక్షరాభ్యాసాలు చేయించారు. ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.
- సుజాతనగర్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. సామూహిక కుంకుమ పూజలు జరిపారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేశారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి ప్రసాద వితరణ చేపట్టారు.

సింహాచలం: 93వ వార్డు పరిధి బాలాజీగార్డెన్‌లో శ్రీ వరసిద్ధి వినాయక వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. విద్యార్థులచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- అడవివరంలోని హవేళి ప్రాంగణంలో శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ ఫ్రెండ్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఏడవరోజు అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చింది. భక్తులు, విద్యార్థులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

దసరా ముగ్గుల పోటీలు

పరవాడ: స్థానిక బొంకుల దిబ్బ వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవి నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకుని బొంకులదిబ్బ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు మంగళవారం రాత్రి ఉత్సాహంగా సాగాయి. పోటీలను పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు ప్రారంభించారు. విజేతలను ప్రకటించారు. ఈ నెల 12న దసరా సందర్భంగా వీరికి బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ మహిళలలో దాగివున్న నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ముగ్గుల పోటీలను ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో పైల వెంకటరావు, హరీష్, వైఎస్సార్‌సీపీ నాయకులు చీపురుపల్లి శ్రీనివాసరావు, పైల పైడినాయుడు, గండి మహేష్, లాలం ముత్యాలనాయుడు, బొంకుల దిబ్బ యూత్ పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రం పరవాడ సంతబయలు వద్ద ప్రతిష్ఠించిన దుర్గమ్మ విగ్రహం వద్ద బుధవారం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడులు అన్నసమారాధనను ప్రారంభించారు. పరవాడ పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బండారు రామారావు, చుక్క వెంకటలక్ష్మి, గండి ఈశ్వరరావు, పైల హరీష్, సత్యవేణి, గండి నమో, కూండ్రపు సోమునాయుడు, రొంగలి అప్పలనాయుడు, కశిరెడ్డి అప్పలరాజు, రెడ్డి నారాయణరావు పాల్గొన్నారు.

బాలికలకు పాదపూజలు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠంలో దసరా బ్రహ్మోత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారం మహా సరస్వతి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మవారి సన్నిధిలో రాజశ్యామల హోమం నిర్వహించారు. పదేళ్ల వయసున్న సుమారు 100 మంది బాలికలను బాలా త్రిపురసుందరిగా భావించి దేశ విదేశాల నుంచి వచ్చిన దేవీ ఉపాసకులు వారి పాదాలకు పసుపు, కుంకుమలు రాసి, షోడశోపచార పూజలు చేశారు. పిల్లలందరికీ ధూపదీప నైవేద్యాలు, నూతన వస్త్రాలు, ఆభరణాలు, గాజులు, పువ్వులు సమర్పించారు. పరవాడకు చెందిన శ్రీమరిడిమాంబ కోలాటం బృందం, అమృత కన్యా గురుకులం పిల్లల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భక్తుల భజనలతో పల్లకీ ఊరేగింపు, శ్రీయంత్ర మహామేరు గిరిప్రదక్షిణలు చేశారు.

- దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని మొగలిపురం శివారులో వీరాంజనేయ యూత్ కమిటీ అధ్వర్యంలో దుర్గమ్మకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సరస్వతి రూపంలో అమ్మవారు దర్శనమిచ్చారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. సరస్వతీదేవి పూజలో పాల్గొన్న పిల్లలకు పుస్తకాలు, పెన్నులు అందించారు. మాజీ ఎంపీపీ గండి దేముడు, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఉపసర్పంచ్ సిరపరపు వాసు, వార్డు మెంబర్లు గండి నాయుడు, గండి ముత్యాలనాయుడు, దేముళ్లు, సురేష్ రులు పాల్గొన్నారు.

శారదాపీఠంలో..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెందుర్తి మండలం చినముషిడివాడలోని శారదాపీఠంలో కొలువైన శారదాస్వరూప రాజశ్యామల అమ్మ వారు మహాసరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ముందుగా అమ్మ వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ చేతుల మీదుగా అమ్మవారికి పూజలు జరిపారు. పీఠ ప్రాంగణంలోని మండపంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు చేశారు. విద్యార్థులు భక్తిశ్రద్ధలతో సరస్వతీదేవి పూజలో పాల్గొన్నారు.



సరస్వతి అలంకరణలో రాజశ్యామలకు పూజలు చేస్తున్న స్వామీజీలు



చిన్నారుల సామూహిక అక్షరాభ్యాసం